సాక్షి
ఆదిలాబాద్
బుధవారం | 22 | జనవరి | 2025



ప్రణాళికతో విజయం

పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. 8లో▸



జీపీగా ఏర్పాటు చేయాలి

బోథ్: మండలంలోని సూర్యనగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుభాష్ చందర్‌తో పాటు మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0/16.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత కొంతమేర పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపించ నుంది.

న్యూస్‌రీల్

కేస్లాపూర్ అభివృద్ధికి రూ.13కోట్లు కేటాయించాలి



సీఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, మాజీ ఎమ్మెల్యే సక్కు

ఉట్నూర్‌రూరల్: కేస్లాపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.13కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సచివాలయంలో మంగళవారం కలిసి విన్నవించారు. నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్య సమస్యలు పరిష్కరించడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారం పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు

కైలాస్‌నగర్: వృత్తిపరంగా ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి క్రీడలు ఉపశమనం కలిగిస్తాయని, అలాగే మానసికోల్లాసానికి దోహదపడుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి క్యారం ఆడి వారిలో ఉత్సాహం నింపారు. నాలుగు రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు దుర్గారాణి, డీఎల్ఎస్ఏ సెక్రెటరీ సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఆదివాసీ దంపతులు ఎంపిక



లలిత-భీంరావు దంపతులు

కైలాస్‌నగర్: ఈ నెల 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఇంద్రవెల్లి మండలకేంద్రానికి చెందిన ఆదివాసీ దంపతులు మేస్రం లలిత-భీంరావు ఎంపికయ్యారు. స్వయం సహాయక సంఘాల్లో కీలకపాత్ర పోషించిన పలువురు సభ్యులను ఈ వేడుకలు తిలకించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఇంద్రవెల్లి గ్రామ, మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అందిస్తున్న సేవలకు గాను ప్రభుత్వం ఆమెను ఎంపిక చేసింది. ఈ నెల 24న వారు ఢిల్లీ వెళ్లనున్నట్లు డీఆర్డీఏ డీపీఎం (ఐబీ)హేమలత తెలిపారు.

'కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న రామన్న

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయలంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు తప్ప మిగతా హామీలేవీ అమలు చేయలేదన్నారు. రైతులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. గ్యాస్ సబ్సిడీ సగం మందికి కూడా అందలేదన్నారు. అలాగే విద్యార్థినులకు స్కూటీ, నిరుద్యోగులకు భృతి, పింఛన్ పెంపు వంటి అనేక హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు నారాయణ, ప్రహ్లాద్, సతీష్, దేవన్న, గోవర్ధన్, రాజు తదితరులున్నారు.

రేకుల ఇంట్లో ఉంటున్నాను



నా పేరు సలెం పూలబాయి. తాంసి మండలం అంబుగాం. నాకు సొంత స్థలం ఉంది. ఆ స్థలంలోనే రేకుల ఇంట్లో నివసిస్తున్నాను. అధికారులు వచ్చి సర్వే చేసుకొని వెళ్లారు. జాబితాలో మాత్రం పేరు లేదు. మరి నేను ఏవిధంగా అర్హురాలిని కాదో అన్నది అధికారులు తెలపాలి.

నాకు గుంట భూమి లేదు..



నా పేరు కత్తెర్ల తిరుపతి. సిరికొండ మండల కేంద్రం. నాకు గుంట భూమి లేదు. 2023–24లో 20 రోజుల ఉపాధిహామీ పథకంలో కూడా పనిచేశాను. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జాబితాలో నా పేరు వస్తుందని అనుకున్నాను. అయితే నా పేరే లేదు. నాకు న్యాయం చేయాలి.

అర్హుడినైనా పేరు రాలే..



నా పేరు గాడ్గే సునీల్. బజార్‌హత్నూర్ మండలకేంద్రం. గతేడాది ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. నా కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను జత చేసి మరీ ఇచ్చిన. ఇప్పుడు జాబితాలో నా పేరు లేదు. నేను అన్నివిధాలా అర్హుడినైనప్పటికీ చోటు కల్పించలేదు.



బజార్‌హత్నూర్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

బజార్‌హత్నూర్ రైతువేదికలో గ్రామసభ నిర్వహించారు. నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి నోటీసుబోర్డుపై లబ్ధిదారుల జాబితా ప్రదర్శించారు. పేర్లు చదివారు. కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని పలు వురు మూకుమ్మడిగా అధికారులను నిలదీశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని, తాము అన్నివిధాలా అర్హులమైనప్పటికీ జాబితాలో చోటు ఎందుకు కల్పించలేదంటూ నిలదీశారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వారిని శాంతింపజేశారు. అయితే మొత్తం డాటా మీ వద్దే ఉన్నప్పు డు మళ్లీ ఎందుకు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రజ లు ప్రశ్నించారు. వివాదం చోటుచేసుకోవడంతో ఎస్సై అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. జనం వినిపించుకోకపోవడంతో కొంతమందిని బయటకు తీసుకెళ్లారు. అంతటితో గ్రామసభ ముగిసింది.

మా పేర్లేవి..?

- అర్హులమైనా జాబితాలో ఎందుకు లేదు..
- తొలిరోజు గ్రామసభల్లో లొల్లిలొల్లి
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న అధికారులు
- 'సంక్షేమ' లబ్ధిదారుల ఎంపికపై విమర్శలు



సిరికొండ మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ట్రైయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, డీఎల్‌పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంపికైన 86 మంది లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. అయితే గ్రామసభలో పాల్గొన్నవారు 'మేము కూడా అర్హులమే' మా పేర్లు ఎందుకు లేవు.. ఈ సర్వే ఏ ప్రకారం చేశారు. ఏ ప్రాతిపదికన ఆ జాబితా విడుదల చేశారు. మాకు కూడా భూమి లేదు. ఉపాధి జాబ్ కార్డు ఉంది. 20 రోజుల కూలీ పని చేశాం. మమ్మల్ని ఎందుకు పరిగణలోకి తీసుకోలేదంటూ అధికారులను నిలదీశారు.

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో గ్రామసభలను ప్రారంభించారు. ప్రత్యేక అధికారులతో పాటు మండల అధికారుల ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు ఈ సభలు కొనసాగాయి. జిల్లాలోని ఆయా మండలాల్లో తొలిరోజు ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణంలోని కొన్ని వార్డుల్లో నిర్వహించారు. శుక్రవారం వరకు ఇవి కొనసాగనున్నాయి. ఇంద్రవెల్లి మండలం సమాక గ్రామంలో కలెక్టర్ రాజర్షిషా గ్రామసభలను ప్రారంభించారు. అదే మండలంలోని పిప్రి, ఉట్నూర్ మండలం ఉమ్రి సభల్లోనూ పాల్గొన్నారు. ఆయా సభల్లోనూ పలువురు తమ పేర్లు లేవని, తాము అర్హులమైనప్పటికీ ప్రయోజనం దక్కడం లేదంటూ వాపోయారు. దీంతో కలెక్టర్ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు.

మళ్లెందుకు దరఖాస్తు చేసుకోవాలనే ప్రశ్న..

మొదటి రోజు జిల్లాలో నిర్వహించిన గ్రామసభల్లో పలుచోట్ల ప్రధానంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం పలువురి నుంచి ఆందోళన వ్యక్తమైంది. రైతు భరోసా విషయంలో అంతగా కనిపించలేదు. తాము అర్హులమైనప్పటికీ జాబితాలో చోటెందుకు కల్పించలేదని ప్రజలు ప్రశ్నించినప్పుడు అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీనికి వారు మళ్లీ తామెందుకు దరఖాస్తు చేసుకోవాలనే ప్రశ్నను లేవనెత్తారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఆయా పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి సర్వే చేసి ఆ డాటాను పూర్తిగా నమోదు చేసినట్లు పలువురు ఆయా సభల్లో పేర్కొన్నారు. డేటా మొత్తం ప్రభుత్వం వద్దే ఉన్నప్పుడు ఆ ప్రకారంగా మాకు జాబితాలో చోటు కల్పించాల్సి ఉండగా, మా పేర్లు ఎందుకు లేవంటూ పలువురు నిలదీయడం కనిపించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వద్ద డేటా, సర్వే విషయంలో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ రాజర్షిషా



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకే గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని సమాక, పిప్రి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభలకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేల ఆధారంగా అర్హులను గుర్తించామన్నారు. ఒకవేళ అర్హులైనా జాబితాలో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమ్రీలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రీలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తొలిరోజు 113 చోట్ల గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. అంతకముందు మండలంలోని ఎక్స్‌రోడ్డు సమీపంలో గల లాల్‌టెక్డీలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో రాం ప్రసాద్, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలు అందాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: సమాజంలోని అట్టడుగుస్థాయిలోని పేదలకు తొలి ప్రాధాన్యతగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నాలుగు ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని రవీంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులు వార్డు పరిధిలోని ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల వరకే పార్టీలన్నారు. గెలిచాక అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసమే అన్ని పార్టీలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. స్థలం ఉన్నవారికే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామంటే పేదలకు ఇళ్లురావని, స్థలం లేని వారికి కూడా ఇంటిని నిర్మించి ఇచ్చేలా చూడాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లుగా వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గంద్రత్ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బైరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట 'ఆశ'ల ధర్నా

కైలాస్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆశ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్‌బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శోభ, జిల్లా కార్యదర్శి సుజాత, ఆశ వర్కర్లు లక్ష్మి, మాధవి, స్వప్న, సురేఖ, ఉమా, మమత, హారిక, కవిత, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న ఆశలు

ఎస్‌హెచ్‌జీల్లో ఎన్నికలు

- తొలుత గ్రామ, మండల సమాఖ్యలకు..
- మార్చిలో 'జిల్లా'కు..
- డీఆర్డీఏ అధికారుల కసరత్తు
- ఏపీఎంలు, సీసీలకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలో..
గ్రామ సమాఖ్య సంఘాలు : 554
మండల సమాఖ్యలు : 18
స్వయం సహాయక సంఘాలు : 1,176
స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు : 1,19,664



శిక్షణకు హాజరైన ఏపీఎంలు, సీసీలు (ఫైల్)

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో నాయకత్వ పటిమ పెంపొందించడంతో పాటు ప్రతీ ఒక్కరికి అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా గ్రామ, మండల సమాఖ్యలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఎస్‌హెచ్‌జీల బైలాస్‌ను సవరించిన సెర్ప్ అధికారులు ఫిబ్రవరి నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఇప్పటికే డీఆర్డీఏ ఏపీడీ, డీపీఎం(ఐబీ)లు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొంది వచ్చారు. వారు జిల్లాలోని ఏపీఎంలు, సీసీలకు ట్రైనింగ్ ఇచ్చారు. గ్రామ, మండల సమాఖ్యల తర్వాత జిల్లా సమాఖ్యను ఎన్నుకోనున్నారు. ఈమేరకు ఆయా సంఘాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

అందరికి అవకాశం కల్పించేలా...

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు మహిళల అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. సంక్షేమ పథకాలన్నీ వారి పేరిటే అమలు చేస్తోంది. ఇందిరమ్మ మహిళాశక్తి కార్యక్రమం కింద వివిధ రంగాల్లో స్వయం ఉపాధి కల్పించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తూ వారికి అండగా నిలుస్తోంది. ఆర్థికంగా ముందడుగు వేయడమే కాకుండా నాయకత్వ లక్షణాలు సైతం పెంపొందించేలా ఆయా సంఘాలకు ఎన్నికలను నిర్వహిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములై తద్వారా రాజకీయంగానూ వారు ముందుకు సాగాలనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తోంది.

గ్రామస్థాయి నుంచి..

గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గల సమాఖ్యలకు ఎన్నికలు నిర్వహించాలని సూచిస్తూ సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు సంబంధించిన నిబంధనలు సైతం సవరించారు. గతంలో చేతులెత్తే విధానంలో నిర్వహించగా ఈ సారి లాటరీ విధానంలో ఎన్నుకోనున్నారు. ఆయా సంఘాల లావాదేవీల నిర్వహణలో అధ్యక్ష, కార్యదర్శులది కీలకపాత్ర. గ్రామంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులంతా కలిసి అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకుంటారు. వారు మండల సమాఖ్య కార్యవర్గ ఎన్నికల సమావేశానికి హాజరవుతారు. అయితే మండల సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి పోస్టులను ఎన్నుకునేందుకు కేవలం అధ్యక్షురాలికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. గ్రామ, మండల సమాఖ్యల ఎన్నికలు ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాలనే సెర్ప్ ఆదేశాలకనుగుణంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ పోస్టులను ఏడాదికి, రెండేళ్లకు, ఐదేళ్ల కాల పరిమితితో లాటరీ విధానంలో ఎన్నుకోనున్నారు. ఏడాది కాలం పదవీకి ఎన్నికైన వారు మరోసారి ఎన్నికల బరిలో నిలిచేందుకు అవకాశం కల్పిస్తారు. ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌లో శిక్షణ పొందివచ్చిన డీఆర్డీఏ ఏపీడీ, డీపీఎం ఐబీలు జిల్లాలోని ఏపీఎంలు, సీసీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తొలుత చిన్న సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో పంచాయతీ పోరుకు ముందే పల్లెల్లో మహిళా సంఘాల్లో ఎన్నికల సందడి షురూ కానుంది. ఇక జిల్లా సమాఖ్యను మార్చి నెలాఖరులోపు ఎన్నుకునేలా ముందుకు సాగుతున్నారు.

సెర్ప్ ఆదేశాలకు అనుగుణంగా..

మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు సంఘాలకు సారథ్యం వహించేలా ఆసక్తి గల మహిళలకు అవకాశం కల్పించాలనే సెర్ప్ ఆదేశాలకనుగుణంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తున్నాం. ఏవిధంగా నిర్వహించాలనే దానిపై జిల్లాలోని ఏపీఎం, సీసీలకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఫిబ్రవరి నెలాఖరులోపు గ్రామ, మండల సమాఖ్యల కార్యవర్గాలను ఎన్నుకుంటాం. అనంతరం మండల సమాఖ్య అధ్యక్షురాళ్లంతా కలిసి జిల్లా సమాఖ్యను ఎన్నుకుంటారు. ఈ అవకాశాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆయా పదవుల కోసం పోటీపడాలి.

– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

నాల్గో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గం రద్దు

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ భవన అద్దెల విషయంలో చోటు చేసుకున్న అక్రమాలను వివరిస్తూ గతేడాది డిసెంబర్ 11న 'నాయకా.. అక్రమాలు చాలిక' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.జ్ఞానేశ్వర్ సంఘం అద్దెలపై విచారణ నిమిత్తం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఎల్.దాస్యనాయక్, కె.రామస్వామి, ఏ.భిక్షమయ్యతో కూడిన ఆ కమిటీ జిల్లా కేంద్రంలో పర్యటించింది. సంఘ భవనానికి వస్తున్న అద్దె, నిల్వ ఉన్న నిధులు, చేసిన ఖర్చులపై విచారణ చేపట్టింది. జిల్లా కార్యదర్శి ఇందిర, సంఘం కేంద్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌తో పాటు సంఘం మడిగెల్లో అద్దెకు ఉంటున్న వ్యాపారులను విచారించి వారి సంతకాలు కూడా సేకరించారు. మడిగెల అద్దెలు రూ.30లక్షలు, అడ్వాన్స్‌గా తీసుకున్న రూ.7లక్షల వివరాలు క్యాష్‌బుక్‌లో నమోదు చేయలేదని, బ్యాంకు అకౌంట్‌లో కూడా లేవని, వాటి మినిట్స్ బుక్ కూడా అందుబాటులో లేనట్లుగా నిర్ధారించిన కమిటీ సభ్యులు సంఘం కేంద్ర అధ్యక్షుడికి నివేదిక అందజేశారు. దాని ఆధారంగా 2024లో నియామకమైన సంఘం జిల్లా కార్యవర్గాన్ని రద్దు చేస్తూ ఆయన మంగళవారం పేర్కొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: లెనిన్ ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. లెనిన్ వర్ధంతిని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచాన్ని కమ్యూనిజం వైపు తిప్పిన వారిలో లెనిన్ ఒకరిని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్, కుంటాల రాములు తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- మల్టీలెవెల్ మార్కెటింగ్ ద్వారా సైబర్ నేరాలు
- అదనపు ఎస్పీ సురేందర్ రావు

కైలాస్‌నగర్: మల్టీలెవెల్ మార్కెటింగ్‌ను ప్రజలు నమ్మవద్దని, వీటి ద్వారా సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్నాయని అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) బి.సురేందర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్, హెర్బల్–హెల్త్, గృహోపకరణాలు వంటి వాటిపై పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చనే ప్రచారం ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. వారి మాయ మాటలు నమ్మి కొంతమంది సభ్యత్వం స్వీకరించి మరికొందరిని చేర్పించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో చాలామంది మోసపోతున్నారని తెలిపారు. కొత్త స్కీమ్‌లతో బహిరంగ మార్కెట్లోకి వస్తున్న వారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలను నియంత్రించాలంటే సోషల్ మీడియాలో వచ్చే అనుమానిత లింకులను ఓపెన్, ఇన్‌స్టాల్ వంటివి చేయకూడదని పేర్కొన్నారు. ఒకవేళ సైబర్ క్రైమ్ బారిన పడిన వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ హసీబుల్లాను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కుంభమేళాలో నిర్మల్ వాసి మృతి


ఫణీందర్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ఒకరు కుంభమేళాలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బుధవార్‌పేట్‌కు చెందిన ఫణీందర్ (50) జిల్లా ఆస్పత్రిలోని ఆయుష్ విభాగంలో పనిచేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లాడు. మంగళవారం కాశీలో దైవదర్శనానికి వెళ్లే క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కడెం: ఈ నెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి భూమన్న (35) ఈనెల 19న ద్విచక్ర వాహనంపై ఉట్నూర్‌లోని సాలేవాడకు వెళ్తుండగా మార్గమధ్యలో మండలంలోని ఉడుంపూర్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సరస్వతి కాలువలో పడి ఒకరు..

సోన్: ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ సరస్వతి కాలువలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్‌లో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి పోతుగంటి చిన్నగంగారాం అలియాస్ నాని (52) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తోట నుంచి ఇంటికి వస్తుండగా అడవి పంది అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి సరస్వతి కాలువలోపడి మృతి చెందాడు. మృతుని భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో స్వాతంత్ర్య సమరయోధుడు..


శ్రీనివాసరావు(ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, విశ్రాంత ఉపాధ్యాయు డు దండనాయకుల శ్రీనివాసరావు (97) మంగళవారం అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. నెలరోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందా రు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ప్రముఖ టీవీ, సినీ దర్శక నిర్మాత నాగబాల సురేశ్ కుమార్ ఆయన కుమారుడే.

క్షతగాత్రులకు పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: జంగుబాయి దర్శనానికి వెళ్తుండగా నార్నూర్ ఘాట్ వద్ద ఐచర్ వ్యాన్ బోల్తా పడిన ఘటనలో గాయపడిన క్షతగాత్రులను మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి పరామర్శించారు. రిమ్స్ వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

పరీక్ష సమయం..
ప్రణాళికతో విజయం

- విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు, ఉపాధ్యాయుల దృష్టి
- మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ

లక్ష్మణచాంద: పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇంటర్ విద్యార్థులకు మార్చి 5 నుంచి, పదో తరగతి విద్యార్థులకు మార్చి 21 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఆయా బోర్డులు ఇప్పటికే తేదీలను ప్రకటించాయి. పరీక్షలు సమీపిస్తుండడంతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

వీటికి దూరంగా ఉండాలి

- విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసే చరవాణి, మొబైల్ గేములు, టీవీలకు దూరంగా ఉండాలి.
- ప్రతీ నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- ప్రణాళిక ప్రకారం ఏ రోజు చదివే అంశాలను ఆ రోజే చదవాలి. వాయిదాలు వేయవద్దు.
- పరీక్షలు పూర్తయ్యే వరకు విందులు, వినోదాలకు దూరంగా ఉండాలి.
- విద్యార్థులు గ్రూపులుగా చేరి వివిద సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై చర్చించాలి.

90 రోజుల ప్రణాళికతో....

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 90 రోజుల ప్రణాళికతో అధ్యాపకులు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి చేశారు. అప్పటి నుండి నిత్యం ప్రతీ సబ్జెక్టు అధ్యాపకుడు ప్రతీరోజు ఉదయం 9 గంటల నుండి 9:45 వరకు, సాయంత్రం 3:10 నుండి 4:30 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వీక్లీ పరీక్షలు, యూనిట్ టెస్టులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో విద్యా బోధన చేస్తున్నారు. ఒకవైపు రివిజన్ తరగతులు నిర్వహిస్తూనే మరోవైపు ఫిబ్రవరి 20న జరిగే ప్రీఫైనల్‌తో పాటు వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు...

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. పాఠశాలల పనివేళల్లో రివిజన్ చేస్తూనే ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులు పలు సూచనలు చేస్తున్నారు.


మామడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు	ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	ఫస్టియర్ విద్యార్థులు	సెకండియర్ విద్యార్థులు
మంచిర్యాల	167	5,851	10	2,012	1,920
నిర్మల్	164	9,127	13	2,505	2,206
ఆదిలాబాద్	107	10,064	13	3,367	3,193
కుమురంభీం	172	6,421	11	2149	2519

పాటించాల్సిన సూచనలు

- పరీక్షలంటే భయం వీడి సమయం వృథా చేయకుండా ముందస్తుగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం చదవాలి.
- సిలబస్ పూర్తి అయ్యిందని ఇంటివద్దే ఉండవద్దు. రివిజన్ క్లాసులు వినడంతో పాటు అక్కడ నిర్వహించే స్టడీ అవర్స్ సమయాల్లో తమకు వచ్చిన సందేహాలు నివృత్తి చేసుకోవాలి.
- ప్రశాంత వాతావరణంలో చదవాలి. మధ్య మధ్యలో కొంత విశ్రాంతి తీసుకోవాలి.
- గత ప్రశ్న పత్రాలు, మోడల్ పేపర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇచ్చిన ముఖ్యమైన ప్రశ్నలను చదవడం వల్ల వార్షిక పరీక్షలలో వచ్చే ప్రశ్నలపై అవగాహన వస్తుంది.
- పిల్లలు చదువుతున్నారో లేదో తల్లిదండ్రులు నిత్యం తప్పకుండా గమనించాలి.
- గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయ శాస్త్రం, జీవశాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం వంటి సబ్జెక్టుల్లో ముఖ్యమైన సూత్రాలు, సిద్ధాంతాలను ఎక్కువ సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రయోగాలు, పటాలు, ఉదాహరణలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- చదివిన ప్రతీ అంశాన్ని మళ్లీ పునఃశ్చరణ చేయాలి.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల కోసం ప్రణాళికాబద్ధంగా చదవాలి. అధ్యాపకుల సూచనలు, మెళకువలు పాటించాలి. సమయం వృథా చేయకుండా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– పురుషోత్తమ్, వృక్షశాస్త్రం అధ్యాపకులు, మామడ

జంక్‌ఫుడ్‌కు దూరం ఉండాలి



వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. మాంసాహారం జోలికి వెళ్లవద్దు. ఆకు కూరలు, కూరగాయలు, పోషక విలువలు, ప్రొటీన్స్, విటమిన్స్, మినరల్స్ ఉన్న ఆహారం మాత్రమే తీసుకోవాలి. నిత్యం యోగా, . ధ్యానం చేయాలి. రోజుకు కనీసం ఆరుగంటలు నిద్రపోవాలి.

– డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, ఫిజీషియన్, నిర్మల్

పరీక్ష హాలులో...

- ప్రశ్నపత్రం ఇచ్చిన తర్వాత ప్రశ్నలను పూర్తిగా చదివి అర్థం చేసుకున్న తర్వాతే సమాధానం రాయడం ప్రారంభించాలి.
- సమయానుకూలంగా ప్రాధాన్యత ఉన్న ప్రశ్నలకు ముందుగా సమాధానం రాయాలి. మళ్లీ ఒకసారి చూసి ఎక్కడైనా తప్పులుంటే సరి చేసుకోవాలి.

ఆరోగ్యం–ఆహారం ముఖ్యమే

పరీక్షలకు సన్నద్ధం అయ్యే విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ముఖ్యమే. కనుక పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని వైద్యులు డాక్టర్ రత్నాకర్‌రెడ్డి సూచిస్తున్నారు.

- ఆకుకూరలు, కాయగూరలతో కూడిన, ప్రొటీన్స్, విటమిన్స్, మినరల్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి.
- పరీక్షల సమయంలో రోజుకు కనీసం 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి.
- పరీక్షలు పూర్తయ్యే వరకు మాంసాహారం ముట్టుకోవద్దు. బయటి ఆహారం, కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారం, జంకుఫుడ్స్ జోలికి వెళ్లవద్దు.
- ప్రతీరోజు ఉదయం, సాయంత్రం యోగా, ధ్యానం చేయాలి. ఇలా చేయడం వల్ల ఆక్సిజన్ పూర్తిగా మెదడుకు అంది చురుకుగా పనిచేస్తుంది.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

కైలాస్‌నగర్: బేల మండలం సదల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని హస్నాపూర్‌లో పొలం పనులు చేస్తున్న యువరైతు ఆడే కిషన్‌పై అడవిపంది దాడి చేసి గాయపర్చింది. పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా వెనుక నుంచి వచ్చి దాడికి పాల్పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి బాధితుడిని పరామర్శించారు.

కోతిని తప్పించబోయి.. చెట్టును ఢీకొట్టిన కారు

- ఐదుగురికి స్వల్పగాయాలు


గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారం సమ్మక్క– సారలమ్మ దర్శనానికి వెళ్తున్న క్రమంలో పస్రా–తాడ్వాయి మధ్యలో ఓ కారు రోడ్డుపైకి వచ్చిన కోతిని తప్పించే క్రమంలో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ బంధువులతో కలిసి భద్రాచలానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. మేడారంలోని వనదేవతల దర్శనం నిమిత్తం వెళ్తుండగా పస్రా–తాడ్వాయి మధ్య జాతీయ రహదారిపైకి వచ్చిన కోతిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఏటూరునాగారం నుంచి ములుగు వెళ్తున్న పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రాంపతి వారిని గమనించి ఆగారు. 108కు సమాచారం అందించి గాయపడిన వారిని తన వాహనంలో పస్రా చెక్‌పోస్టు వరకు తీసుకెళ్లారు. అక్కడికి అంబులెన్స్ రాగా, ములుగు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాంపతి మరో వాహనాన్ని పిలిపించి డీఈతోపాటు బంధువులను ఆదిలాబాద్‌కు తరలించి మానవత్వం చాటుకున్నారు.

ఎక్సైజ్ అధికారుల స్పెషల్ డ్రైవ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాటుసారా తయారీ నిర్మూలన లక్ష్యంగా మందమర్రి మండలం పులిమడుగు, కాసిపేట మండలం మామిడి గూడెం గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి 16 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. పులిమడుగుకు చెందిన కుస్నోత్ కిషన్, గుగ్లోత్ రాజు, మామిడిగూడెం గ్రామానికి చెందిన నగావత్ నాగమ్మపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ తెలిపారు. దాడుల్లో మంచిర్యాల డీటీఎఫ్ సీఐ ఎస్.సమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సైలు ఎం.వెంకటేష్, మనీషా రాథోడ్, సిబ్బంది సురేష్, అజయ్, గణేశ్, విజయ, రవీందర్, లక్ష్మణ్, సాగర్, రాజయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


పట్టుకున్న నాటుసారాతో ఎక్సైజ్ అధికారులు

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని బంగ్లా ఏరియాలో గల ఇల్లందు క్లబ్‌లో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అధికారుల సతీమణులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) డీ సత్యనారాయణరావు సతీమణి హరిణి, డైరెక్టర్(పీపీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తిరుమల వేంకటేశ్వర ఆలయంసెట్టింగ్‌లో శ్రీనివాస కల్యాణాన్ని తలపించే ఆకృతులు, బొమ్మలను సర్వాంగ సుదరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ సతీమణి మాలతి, అధికారుల సతీమణులు లక్ష్మీ, స్వరూప, ఉమా, సుధా, అనిత, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు క్లబ్‌లో కొలువుదీరిన బొమ్మలు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘం తరఫున పోటీ చేస్తున్న వంగ మహేందర్‌రెడ్డిని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ కోసం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నూతన హెల్త్‌స్కీమ్, పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏనుగు అశోక్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణారావు, భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

దారి సమస్య తీర్చాలని వినతి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 26వ వార్డు అశోక్ నగర్ బస్తీ వాసుల దారి సమస్య తీర్చాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అజయ్‌కుమార్ జైన్‌ను కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయనను కలిసి రైల్వేలైన్ నుండి అశోక్ నగర్ బస్తీకి రహదారి సమస్య ఉందని వివరించారు. ఆ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, నాయకులు ఖాజా, చోటే, పోశం, బస్తీవాసులు సలీం, నసీర్, జాఫర్, బద్రొద్దీన్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి

మంచిర్యాలఅర్బన్: సూర్‌వీర్ సేవాలాల్ మహరాజ్ జయంతి(ఫిబ్రవరి 15)ని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి దేశ వ్యాప్తంగా జరుపుకునేందుకు వెయ్యికోట్ల బడ్జెట్ కేటాయించాలని, జాతీయస్థాయిలో బంజార ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు లచ్చన్న, రఘునందన్, శ్రీనివాస్, జీవీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఈశ్వర్, చరణ్‌నాయక్, నరేష్, రవీందర్‌నాయక్, వంశీ పాల్గొన్నారు.

పెంపుడు కుక్క యజమానిపై కేసు

మందమర్రిరూరల్: పెంపుడు కుక్క చేసిన పనికి యజమానిపై కేసు నమోదైంది. సంఘటన మందమర్రి పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఫస్ట్‌జోన్‌కు చెందిన తాటికొండ బెంజిమెన్ పెంపుడు కుక్క మంగళవారం ఇదే జోన్‌కు చెందిన బైరాజు పాపయ్యను కరిచింది. దీంతో ఆయన కాలికి తీవ్ర గాయమైంది. బెంజిమెన్ తన పెంపుడు కుక్కను నిర్లక్ష్యంగా బయటకు వదిలి వేయడంతో దారిన వెళ్తుండగా పాపయ్యను కరిచిందని ఆయన కుమారుడు మధూకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బెంజిమెన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు అదృశ్యం


బెంబరి బాపు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన బెంబరి బాపు అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బాపు ఈ నెల 20న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో అతని కుమారుడు భూమేష్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడిబజార్ ఏరియాకు చెందిన అక్బర్‌పాషా కనిపించడంలేదని అతని భార్య అస్మా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మద్యానికి బానిసై ఈ నెల 19న ఇంటినుంచి వెళ్లి ఇంత వరకు ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికలు నిర్వహించాలి


వినతిపత్రం ఇస్తున్న రాములు నాయక్

బెల్లంపల్లి: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్యా రాములు నాయక్ సోమవారం రాత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పాల్వంచ, మణుగూరు, కొత్తగూడెం, మందమర్రి మున్సిపాలిటీలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్నాయని, వాటికి దశాబ్దాలుగా ఎన్నికలు జరగడంలేదన్నారు. ఎన్నికల నిర్వహణకోసం మార్గదర్శకాలు ఉన్నా అమలు కావడం లేదని, తద్వారా ఏజెన్సీ ప్రాంతాల ఎస్టీలు ప్రజాస్వామిక ఎన్నికల్లో పాల్గొనలేక, రాజకీయంగా ఎదగలేకపోతున్నారని వివరించారు.

సీఎండీ దృష్టికి ఎస్టీపీపీ కార్మికుల సమస్యలు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్తానని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు ఇతర అలవెన్సులను కలిపి వేతనంతో రూ.5వేలు అదనంగా చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఒక్కరోజు టోకెన్ చేపట్టిన సమ్మెలో ఎస్టీపీపీలో గల 13 డిపార్టుమెంట్ల నుంచి 1040 మంది కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. సమావేశంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, సత్యనారాయణచారి, నవీన్, శ్రీధర్, అక్బర్, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

కోళ్లు చనిపోతున్నాయ్...!

- ఆర్‌డీ వైరస్ బారిన పడుతున్న వైనం
- పశువైద్యశాలల్లో అందుబాటులో లేని వ్యాక్సిన్

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పెంపుడు కోళ్లు అకస్మాత్తుగా చనిపోతున్నాయి. అప్పటి వరకు బాగానే ఉన్నా ఒక్కసారిగా మృత్యువాత పడుతున్నాయి. దీంతో కారణం తెలియక పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక శాస్త్రినగర్‌లో వారంరోజుల్లో 20కి పైగా కోళ్లు చనిపోయాయి. ఈ విషయమై 'సాక్షి' స్థానిక పశువైద్యుడు విఠల్‌ను ఫోన్‌లో సంప్రదించగా కోళ్లకు ఈ సీజన్‌లో ఆర్‌డీ (రానికేట్ డిసీజ్) వైరస్ సోకుతుందని, ఈ కారణంగానే మృత్యువాత పడుతున్నాయన్నారు. ఏటా వర్షాకాలం–చలికాలం, చలికాలం–వేసవికి మధ్య రెండుసార్లు కోళ్లు ఈ వైరస్ బారిన పడుతాయన్నారు. వ్యాధి నియంత్రణ కోసం పెంపకందారులు ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాల్సి ఉంటుందన్నారు. కానీ కొంతకాలంగా పశు వైద్యశాలలకు ఆర్‌డీ వ్యాక్సిన్ సరఫరా నిలిచిపోయిందన్నారు. ప్రైవేటులోనూ అందుబాటులో లేదన్నారు. ప్రభుత్వం పశువైద్యశాలలకు ఆర్‌డీ వ్యాక్సిన్ సరఫరా చేయాలని కోళ్ల పెంపకందారులు కోరుతున్నారు.


శాస్త్రినగర్‌లో మృతి చెందిన కోళ్లు

పాపహరేశ్వరాలయానికి రూ.3,68,500 ఆదాయం

దిలావర్‌పూర్: మండలంలో అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వరాలయానికి ఆలయ ప్రాంగణంలోని దుకాణాల ద్వారా రూ.3,68,500 ఆదాయం సమకూరింది. ఆలయ ప్రాంగణంలో ఏడాది పాటుగా కొబ్బరికాయలు, పూజా సామగ్రిని విక్రయించేందుకు మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు విక్రయించేందుకు రూ.2,04,000, కిరాణ, పూజా సామగ్రి దుకాణానికి రూ.1,64,500 సమకూరింది. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్, ఆలయ ఈవో భూమయ్య, జూనియర్ అసిస్టెంట్ జాదవ్ మాధవరావు పాటిల్, ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, నాయకులు సింధే దత్తురాం, జాదవ్ మారుతీరావు, మల్లాజీ, సాయినాథ్, ఆలయ అర్చకులు పంచాక్షరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

అధికారులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు వరుసగా అవార్డులు సాధించడంలో అధికారుల పాత్ర కీలకమని, ఇందుకు కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఎస్టీపీపీని సందర్శించి అడ్మిన్ భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీ నీటి వినియోగంతో పాటు రక్షణలో వరుసగా నాలుగు అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎంలు శ్రీనివాసులు, ఎస్ఎన్.ప్రసాద్, ఏజీఎం మదన్ మోహన్, అధికారులు సముద్రాల శ్రీనివాస్, అజ్మీర తుకారాం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు